

జంగారెడ్డిగూడెంలో వర్షం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురవడంతో జనం ఎండవేడిమి, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. బలమైన ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



జంగారెడ్డిగూడెంలో కురుస్తున్న వర్షం

'పెనుగొండ ప్రాంతానికి చెందిన రామకృష్ణ కుమార్తె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లికి వందనం ఆగిపోయింది. అదేమని అడిగితే 300 యూనిట్లు విద్యుత్ వాడకం ఉందని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారుల వద్దకు వెళ్తే ఏడాది సరాసరి చూసినా ఆ కుటుంబానికి 300 యూనిట్లు కంటే బాగా తక్కువగానే ఉంది. ఆ శాఖ అధికారుల నుంచి లేఖ తెచ్చి సచివాలయంలో ఇచ్చారు. తల్లికి వందనం ఇస్తారో లేదోననే అనుమానం ఆ కుటుంబంలో నెలకొంది'.

'ఏలూరుకు చెందిన సత్యనారాయణ కుమార్తె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లికి వందనం రాలేదు. అదేమని సచివాలయానికి వెళ్తే నాలుగు చక్రాల వాహనం ఉందని చెబుతున్నారు. తనకు కారు లేదని, ఐదేళ్ల క్రితం విక్రయించానని లబోదిబోమంటున్నాడు. రవాణాశాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అన్ని పత్రాలు సమర్పించినా తల్లికి వందనం వస్తుందో, లేదోననే ఆందోళన నెలకొంది'.

తల్లికి వందనం అందేనా..?

పథకం అమలులో ముప్పతిప్పలు

సంబంధం లేని కారణాలతో అనర్హుల జాబితాలోకి

రెండు జిల్లాల్లో దాదాపు లక్షకుపైగా విద్యార్థులకు అందని సొమ్ము

కరెంటు బిల్లులు, వాహనాలు, భూముల తప్పిదాలే ఎక్కువ

అధికారులు, సచివాలయాల చుట్టూ తల్లిదండ్రులు ప్రదక్షిణలు

పోస్టాఫీసు ఖాతాలో జమైన సొమ్ము తీసుకోలేని దుస్థితి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఇద్దరు బాధితులే కాదు. రెండు జిల్లాల్లో లక్షకుపైగా విద్యార్థుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన తల్లికి వందనం పథకం సొమ్ము రాక తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. అర్హతున్న విద్యార్థులను సైతం అనర్హత జాబితాలో చేర్చడంతో గ్రామ, వార్డు సచివాలయాలు, సంబంధిత శాఖల అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అసలు ఆ కుటుంబాలకు సంబంధం లేని కారణాలను చూపి తల్లికి వందనం నిలుపుదల చేయడంతో రెండు జిల్లాల్లో లక్షకుపైగా కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఇంతా తిరిగి పత్రాలు సమర్పించాకైనా తమకు తల్లికి వందనం వస్తుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. హామీ ఇచ్చినట్లుగా పథకం అమల్లోకి తెచ్చినా.. అర్హతున్నా చాలామంది విద్యార్థులను అనర్హుల జాబితాలోకి నెట్టేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అనర్హత జాబితాలో ఉన్నవారంతా సంబంధిత పత్రాలను సచివాలయాల్లో అప్పగించాలని ఈ నెల 20వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. శుక్రవారంతో గడువు ముగిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,76,574 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తేల్చారు. మొత్తం 1,16,182 మంది తల్లులకు సంబంధించిన పిల్లలు జాబితాలో ఉన్నారు. ఇంకా 29,323 తల్లులకు చెందిన 41,703 మంది విద్యార్థులను అనర్హత జాబితాలో చేర్చారు. ఏలూరు జిల్లాలో మొత్తం 2,15,082 మంది విద్యార్థులు అర్హత సాధించగా, ఇందులో దాదాపు 60 వేల మందికిపైగా విద్యార్థులను అనర్హుల జాబితాలోకి చేర్చారు. దీంతో రెండు జిల్లాల్లో లక్షకుపైగా విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము జమ కాలేదు. అనర్హుల జాబితాలోకి చేర్చిన విద్యార్థులకు చూపిన కారణాలు సైతం అత్యంత దారుణంగా ఉన్నాయి. అనర్హత జాబితాలోకి చేరిన వారిలో ఎక్కువ మంది 300 యూనిట్లు కరెంటు బిల్లు దాటిన కుటుంబాలుగా చూపించారు. వాస్తవానికి 300 యూనిట్లుపైగా విద్యుత్ వాడుకుంటున్నట్లు చూపిన వారిలో 90 శాతం కుటుంబాలు అంతకు తక్కువగా వాడుకున్నవే ఉన్నాయి. దీంతో విద్యుత్ శాఖాధికారుల చుట్టూ తిరిగి తాము అంత కరెంటు వాడుకోలేదంటూ లేఖలు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక సచివాలయంలో 50 మంది అనర్హత జాబితాలో ఉంటే 40 మంది విద్యుత్ బిల్లుల సమస్యలే కారణంగా ఉన్నారు. నాలుగు చక్రాల వాహనం ఉన్నట్లు చూపించిన వారికి ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడో తమ పేరున కారు ఉండి అది విక్రయించి ఏళ్లు గడుస్తున్నా ఆపేశారు. రవాణాశాఖ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వర్ పనిచేయడం లేదంటూ ఒకటికి, రెండుసార్లు తిరగాల్సి వస్తోంది. భూములు లేనివారికి భూములు ఉన్నట్లు చూపి అనర్హత జాబితాలోకి చేర్చేశారు. దీంతో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పిల్లలను తీసుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. ఇంత కష్టపడి తిరిగి అన్ని పత్రాలు సమర్పించినా తల్లికి వందనం అందుతుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. తనకు కారు లేదని జిల్లా రవాణాశాఖ అధికారులు పత్రం ఇచ్చినా రాష్ట్రస్థాయిలోని రవాణా వెబ్‌సైట్‌లో మాత్రం కారు ఉన్నట్లుగానే చూపిస్తోంది. విద్యుత్ బిల్లులకు సంబంధించి సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. సచివాలయాల్లో గురు, శుక్రవారాల్లో గ్రీవెన్స్ నమోదు చేసి వివరాలు పంపించారు. ఇందులో ఎంతమంది అర్హత జాబితాలో ఉంటారో తెలియక అంతా తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు.


పోస్టాఫీసుల్లో జమైన సొమ్ము కోసం అవస్థలు

బ్యాంకు అక్కౌంట్‌కు ఆధార్ లింకు చేయించుకునేందుకు వెళ్లిన తల్లులకు, అక్కడి అధికారులు రూ.200 తీసుకుని పోస్టల్ అక్కౌంట్ ఓపెన్ చేశారు. ఇప్పుడు చాలామంది విద్యార్థులకు సంబంధించిన తల్లికి వందనం సొమ్ము పోస్టల్ అక్కౌంట్లలో జమయ్యాయి. ఆ సొమ్ము తీసుకునేందుకు వెళ్లగా సొమ్ములు సరిపడా లేవు.. తర్వాత ఇస్తామంటూ చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో తల్లులు సొమ్ము కోసం పోస్టాఫీసుల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో తల్లికి వందనం అమలు తీరుపై జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. తమకు సంబంధం లేని కారణాలు చూపి అనర్హత జాబితాలో పెట్టి, తిప్పించడంపై తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మా స్కూలు.. మాకు కావాలి..!

లేదంటే టీసీలు తీసుకోబోమని స్పష్టీకరణ

కోడూరు యుపి స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



స్కూల్లో బైఠాయించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రజాశక్తి -ముదినేపల్లి

'మా స్కూల్ మాకే కావాలి' అంటూ మండలంలోని కోడూరు యుపి స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతూ తమ గ్రామంలోని యుపి పాఠశాలలోనే తమ పిల్లలు చదువుకుంటారని, దూర ప్రాంతంలో ఉన్న హైస్కూల్‌కు తమ పిల్లలను పంపలేమని స్పష్టం చేశారు. ఎప్పటిలాగే కోడూరు స్కూలును యుపి స్కూల్‌గా కొనసాగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తమ యుపి స్కూలును ప్రాథమిక పాఠశాలగా మార్చడం సరికాదన్నారు. గ్రామస్తులకు తెలియకుండా ఎంఇఒ నరేష్ కుమార్ 6 నుంచి 8 తరగతుల వరకు తొలగించడం దారుణమన్నారు. దీంతో తమ పిల్లలు గ్రామం నుంచి జాతీయ రహదారి వెంబడి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాలపర్రు, లేదా ముదినేపల్లి వెళ్లి చదువుకోలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12 నుంచి ఆ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులతోపాటు 7, 8 తరగతుల విద్యార్థులు 20 మంది ప్రతిరోజూ పాఠశాలకు వస్తూనే ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. శుక్రవారం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి తమ ఊరి పాఠశాలను యుపి పాఠశాలగానే కొనసాగించాలని కోరారు.

రెవెన్యూ శాఖలో పని చేయడం గర్వకారణం

రెవెన్యూ డే వేడుకల్లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి



పోటీల్లో విజేతలకు బహుమతులందిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వంలో అన్ని శాఖల కన్నా ప్రజలకు ఎక్కువగా సేవలందించే చేసేది రెవెన్యూ శాఖ అని, అటువంటి శాఖలో పని చేస్తున్నందుకు సిబ్బంది గర్వకారణంగా భావించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం 'రెవెన్యూ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధి కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజంలో ఏ సమస్యలు ఎదురైనా పరిష్కరించడం, వరదలు వంటి విపత్తు సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ప్రజలకు రెవెన్యూ శాఖ సేవలందిస్తుందన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు తాము పనిచేసే పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తే ప్రజలు వారిని ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖాధికారులు ప్రజలకు ఉత్తమ సేవలందించి రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు, నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లో నిర్వహించిన రంగోలి పోటీలను, గోదావరి సమావేశపు హాలు ఆవరణలో రెవెన్యూ చట్టాలు పుస్తక ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అన్సారీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, సూపరింటెండెంట్లు చల్లన్నదొర పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ఉత్తమసేవలందించి ఉద్యోగ విరమణ చేసిన జగన్మోహన్‌రావు, బన్నీ, పోతురాజు, రాజశేఖర్, రాజశేఖర్‌రాయుడు, చంద్రశేఖర్ తదితరులను దుశ్శాలువాతో కలెక్టర్ సన్మానించారు. రెవెన్యూ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను కలెక్టర్ వెట్రిసెల్వి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్విని, జెసి పి.ధాత్రిరెడ్డిని సిబ్బంది సన్మానించారు.



రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన సన్మానం

ఏలూరు సిటీ: రెవెన్యూ డే వేడుకలను స్థానిక రెవెన్యూ భవనంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అన్ని శాఖలకు తల్లి వంటి రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని మరింతగా పెంచేందుకు, రెవెన్యూ శాఖ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేసేందుకు, ప్రతి రెవెన్యూ ఉద్యోగిలో ఉత్సాహాన్ని నింపేందుకు రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్థాయి నుండి విఆర్‌ఎ స్థాయి వరకు రెవెన్యూ ఉద్యోగులు అహర్నిశలు పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తుంటారని తెలిపారు. అసోసియేషన్ సెక్రటరీ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ రాత్రనక, పగలనక శ్రమించే రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు సమర్ధవంతమైన సేవలను అందిస్తారన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రరావు, ఏలూరు డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణస్వామి, జాయింట్ సెక్రటరీ మాధవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయక్, ఏలూరు తహశీల్దార్ గాయత్రి, రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొల్లేరులో ఉపాధి పనులు జరిగేనా

సామాజిక తనిఖీల పేరుతో రూ.లక్షల్లో రికవరీ దుర్మార్గం

నేతల ఒత్తిళ్లతో కిందిస్థాయి ఉపాధి సిబ్బందిపై వేధింపులు సిగ్గుచేటు

ఎపి వ్యకాస ఆధ్వర్యాన కైకలూరు ఎంఎల్ఎ కామినేనికి వినతి అందజేత



ఎంఎల్ఎకు వినతి అందిస్తున్న వ్యకాస నేతలు

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరు ప్రాంత ప్రజలకు జీవనాధారంగా ఉన్న మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు రాబోయే కాలంలో జరుగుతాయో, లేదో అనే ఆందోళనలో ప్రజలు ఉన్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు, ఏలూరు క్లస్టర్ ఏపీడీ పురుషోత్తం, సంబంధిత అధికారులకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరు నిత్యం నీటితో నిండి ఉన్న ప్రాంతం అన్నారు. ఇలా నీటితో నిండి ఉన్న ప్రాంతంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న నేపథ్యంలోనే సామాజిక తనిఖీలు చేయాలని తెలిపారు. అయితే అధికారులు సంవత్సరం తర్వాత పనులు పూర్తయిన తర్వాత వచ్చి సామాజిక తనిఖీలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సామాజిక తనిఖీలను పని ప్రదేశాల్లోనే రికార్డుల వెరిఫికేషన్ పనులు జరుగుతున్న ప్రాంతంలోనే జరపాలని కోరారు. ఇలా జరపకపోవడం వల్ల నేడు ఉపాధి హామీ కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై కొలతల్లో తేడాలు ఉన్నాయని. ఫొటోలు ఆధారంగా వీటిని పరిగణనలోకి తీసుకోలేమని చెబుతూ ప్రభుత్వం ఇచ్చిన కొలతల ఆధారంగా వేతనాలు వేస్తున్నామంటూ ఓపక్క, పనుల్లో లోపాలున్నందున సొమ్ము రికవరీ చేయాలని చెప్పడం దుర్మార్గమన్నారు. కొల్లేరు ప్రాంతంలో సుమారు 6, 7 అడుగుల లోతులో పంట కాలువలు, మురుగు కాలువలు, బోదెలు ఉన్నాయని, వాటిలోకి దిగి కూలీలు జంగిల్ వంటి పనులు చేస్తున్నారని తెలిపారు. మరోపక్క పంట కాలవలో శుభ్రం చేయడంతోపాటు దాని పొడవు, వెడల్పు చట్టప్రకారం ఇచ్చిన లెక్కల ప్రకారం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తీస్తున్న ఫొటోలు సరిగా లేకపోవడం వల్ల ఒకపక్క కూలీలకు, మరోపక్క ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నష్టం జరిగేలా ఉందని తెలిపారు. కొల్లేరు ప్రాంతంలో మాన్యువల్ పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు చేపట్టాలని ప్రభుత్వాధికారులను కోరారు. ఉపాధి పని ప్రదేశాల్లో పనిముట్లు, మెడికల్ కిట్లు, కనీస సౌకర్యాలైన మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సంవత్సర కాలంలో నియోజకవర్గంలో ఎక్కడా ఆ రకమైన సౌకర్యాలు కల్పించలేదని మండిపడ్డారు. ఈ క్రమంలో సామాజిక తనిఖీల పేరుతో కూలీలను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కూలీలకు ఇవ్వాల్సిన కనీస వేతన చట్ట ప్రకారం రూ.309 ఇస్తామన్న హామీ ఇప్పటికీ ఈ నియోజకవర్గంలో అమలు కాలేదన్నారు. నియోజకవర్గంలోని 108 పంచాయతీల్లో ఏ ఒక్క చోటా పే స్లిప్ ఇవ్వకపోగా కూలీలకు వేతనాలు నెలలు తరబడి పెండింగ్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో చేపలు, రొయ్యల చెరువులతోపాటు నిత్యం నీటితో ఉండటం వల్ల ఉపాధి పనులు లోపభూయిష్టంగా జరుగుతున్నాయన్నారు. టార్గెట్ల పేరుతో ఉపాధి సిబ్బందిని మానసికంగా ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ స్పందించి మాట్లాడుతూ రికవరీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపాధి సిబ్బందిపై ఎలాంటి ఒత్తిడీ లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు, కార్యకర్తలు, ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్లో ప్రశాంతంగా సాగాయి. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఐదున్నర వరకు సాగాయి. మొత్తం 787 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోగా 615 ఓట్లు పోలయ్యాయి. సీనియర్ అడ్వకేట్లు సిహెచ్. స్టీఫెన్ సుధీర్, ఎంవి. నారాయణరాజు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా ఎపి బార్ కౌన్సిల్ నుంచి ముప్పాళ్ల సుబ్బారావు, బ్రహ్మరెడ్డి ఎన్నికలను పర్యవేక్షించారు. సాయంత్రం 6:30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అయితే రాత్రి పది గంటల సమయానికి కూడా బ్యాలెట్లు వేరు చేసే ప్రక్రియ సాగుతుండటంతో ఫలితాలు వెలువడలేదు.

ప్రేమను అంగీకరించడం లేదనే కక్షతో..!

యువతిపై యువకుని హత్యాయత్నం

ప్రజాశక్తి - ముదినేపల్లి

తనను ప్రేమించడం లేదనే కక్షతో యువతిపై ఓ యువకుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కోడూరు గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడూరుకు చెందిన యువతి (22) గుడివాడలోని వికెఆర్‌విఎన్‌బి కళాశాలలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతోంది. యువతితో అదే అదే గ్రామానికి చెందిన దొంగ సాయి సన్నిహితంగా ఉండేవాడు. యువతి ఇంట్లో వాళ్లు మందలించడంతో ఆమె అప్పటి నుంచి సాయికి దూరంగా ఉంటోంది. అయితే తనను ప్రేమించాలంటూ సాయి ఆ యువతి వెంటపడుతున్నా ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో దొంగసాయి యువతి ఇంటికి వెళ్లి కిటికీ అద్దం పగలగొట్టి యువతి జుట్టు పట్టుకుని కమ్మ కత్తితో గొంతు మీద కోశాడు. యువతి చేతులు అడ్డంపెట్టి గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి సాయి పరారయ్యాడు. ఈ దాడిలో యువతి మెడ కింద ఎడమ భాగంలో, కుడి చేయి వేళ్లకు గాయాలయ్యాయి. ఎస్ఐ వీరభద్రుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముద్దాయి ఆచూకీ కోసం సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి, నేరం జరిగిన ఐదు గంటల్లోనే అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



వినతి అందిస్తున్న సిఐటియు నేతలు, కార్యకర్తలు

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ, వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

యధావిధిగా ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, మహిళల భద్రత కోసం రాత్రి వేళలో మహిళలకు పని మినహాయింపు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్.సరోజినీ, మాణిక్యం, సరళా దేవి, కవిత, అరుణకుమారి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి చేయూత

స్వగ్రామం గమళ్లపేటలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌ఎ బి.గోపీమూర్తి తన స్వగ్రామం యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామ పరిధిలోని గమళ్లపేటలో సోమవారం 70 మంది పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గమళ్లపేట అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పి.క్రాంతి కుమార్ అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా నిరాటంకంగా తన స్వగ్రామంలో చదువుతున్న పదో తరగతిలోపు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తాను సమాజం నుంచి ఎన్నో వనరులు సేవలు చైతన్యాన్ని పొందానని తిరిగి మెరుగైన సమాజాభివృద్ధికి తనవంతు ప్రయత్నంగా 18 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నిమెరక యువ నాయకులు వలవల విష్ణు బాలాజీ, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి. రామ్మూర్తి నాయుడు, కోశాధికారి వి.సందీప్‌కుమార్, ఆఫీస్ బేరర్స్ జెఆర్‌వి.నాగేశ్వరరావు, ఎం.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఆదివారపుపేటలోని ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాంతి జయకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బ్యానర్లు చేపట్టి శుక్రవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. నగర వీధుల్లో ప్రభుత్వ బడి–చదువుల గుడి, ప్రభుత్వ విద్య – ఉచిత విద్య, ఎక్కడో ఎందుకు దండగ – మన ప్రభుత్వ బడి ఉండగా, సర్కార్ బడి పిల్లలు – సత్తా కలిగిన పిడుగులు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు అత్యుత్తమ శిక్షణ పొంది ఉన్నత విద్యను అభ్యసించారని తెలిపారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే తప్పక చేర్చాలని తల్లిదండ్రులను కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, కార్యకర్తలు

నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలి

23న యువత పోరు: వైసిపి


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని తక్షణమే అమలు చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయప్రకాష్, యువజన నాయకుడు కామిరెడ్డి నాని డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 23న యువతపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలియజేస్తామని, ఆపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. తక్షణమే నిరుద్యోగులకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, మున్నుల జాన్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

లా సెట్‌లో జస్వంత్‌కు 87వ ర్యాంకు


ప్రజాశక్తి - నూజివీడు టౌన్

లా సెట్‌లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన వలివేటి జస్వంత్‌కు 87వ ర్యాంకు సాధించారని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు తెలిపారు. జస్వంత్‌ను ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణ, డీన్ కె.సురేష్‌బాబు, ఇతర అధ్యాపకులు అభినందించారు.


జస్వంత్

జాతీయ క్రీడాకారుడు రాహుల్‌కు 134వ ర్యాంక్

నూజివీడు టౌన్ :పట్టణానికి చెందిన జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు వాకా రాహుల్ ఎపి లా సెట్‌లో 134వ ర్యాంకు సాధించారు. చదువులో, క్రీడల్లో రాహుల్ అత్యంత ప్రతిభ కనపరిచి అందరి మన్ననలు పొందారు. లాసెట్‌లో ర్యాంకు సాధించినందుకు అధ్యాపకులు, తోటి క్రీడాకారులు రాహుల్‌ను అభినందించారు. రాహుల్ మాట్లాడుతూ విజయవంతంగా లా శిక్షణ పూర్తి చేసి, పేద కుటుంబాలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తానని తెలిపారు.


రాహుల్

తాగునీటి సమస్య పరిష్కరించరూ..!

కన్నాయగూడెం వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు పంచాయతీ పరిధిలోని కన్నాయగూడెంలో వారం రోజులుగా తాగునీటి సమస్య తీవ్ర స్థాయిలో ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత గేట్ వాల్వ్ కారణంగా తరచూ ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయడం లేదని విమర్శిస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతం అవుతుందంటూ కొత్త గేట్ వాల్వ్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. దీనిపై పొంగుటూరు సెక్రటరీ రుక్సానాను వివరణ కోరగా గేట్ వాల్వ్ మరమ్మతులకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినట్టు తెలిపారు. మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి

ప్రజాశక్తి - ముసునూరు

సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు పెట్టుబడి తక్కువ అవుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరి మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి మరిన్ని పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజనుల అభ్యున్నతికి మరిన్ని పథకాలు అందించడమే జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం లక్ష్యమని ఎంపిడిఒ నిఖిల్ మధు శరత్ తెలిపారు. మండలంలోని వంకవారిగూడెంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో పలువురు గిరిజనుల నుంచి పలు రకాల పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించి, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం మరిన్ని పథకాలు అందించడమే ధర్తీ ఆబా జనభాగిదారీ అభియాన్ కార్యక్రమం పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుంజా పార్వతి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్, ఎఒ కె.గంగాధర్, ఎపిఎం రూప్ని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నేడు జీలుగుమిల్లి మండల సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ శనివారం మధ్యాహ్నం 2.30 నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, కార్యదర్శులందరూ సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇంగ్లీష్ మీడియం అర్థం కావడం లేదని..

ప్రజాశక్తి - చింతలపూడి

ఇంటర్ చదువుతున్న బాలిక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాత చింతలపూడి గ్రామానికి చెందిన బొట్ల స్నేహిత (17) చింతలపూడి హయగ్రీవ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె పదో తరగతి వరకు గురుకుల పాఠశాలలో తెలుగు మీడియంలో చదివి ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో చేరింది. ఇంగ్లీష్ అర్థం కాక గత కొన్ని రోజులుగా ఒత్తిడిలో ఉంటుందని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ రాత్రి స్నేహిత తల్లిదండ్రులు దాబా పైన పడుకోగా ఇంట్లో హాలులో పడుకుంటానని వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుడి అత్యాచారం

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి 17 ఏళ్ల బాలికపై 22 ఏళ్ల యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. అదే గ్రామానికి చెందిన మంటపాం వెంకట శ్రీనివాసరావు బాలికతో ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అనంతరం నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో ఉన్న తన తాతయ్య ఇంటికి బాలికను తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో గాయపరిచిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కత్తితో గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన పిన్నిబోయిన రమేష్ గ్రామంలోని గొల్ల వీధిలో తన స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన కొండబోయిన శివ చిన్న చక్ర వాహనం కవరులో ఉన్న కత్తిని తీసి రమేష్‌పై దాడి చేశాడు. గాయాలపాలైన రమేష్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలంలో పలుచోట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. పల్లెర్లమూడిలో చేసిన దాడిలో గ్రామానికి చెందిన చోడగిరి వీర్రాజు వద్ద పది మద్యం సీసాలు, మొర్సపూడిలో చేసిన దాడిలో గ్రామానికి చెందిన అచ్చి వెంకటేశ్వరరావు వద్ద తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా తమకు సమాచారం అందిస్తే తక్షణమే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పేదలకు అందుబాటులో అత్యున్నత వైద్య సేవలు

ఆరోగ్య హాస్పిటల్స్ వైద్యులు దంతేష్, సాహితి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అత్యవసరమైన వైద్య సేవలు, మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు విజయవాడ, హైదరాబాద్, వైజాగ్ వంటి మహానగరాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేదని ఆరోగ్య హాస్పిటల్స్ జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ అసోసియేట్ ప్రొఫెసర్, ఫెలోఇన్ 2డి ఎకో ప్రముఖ వైద్య నిపుణులు చలసాని దంతేష్, జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రముఖ వైద్య నిపుణులు బోడేపూడి సాహితి తెలిపారు. నూజివీడులో పేద ప్రజలకు అందుబాటులో మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను ఆరోగ్య హాస్పిటల్స్ ద్వారా అందిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు 2021వ సంవత్సరానికి పూర్వం అత్యవసర వైద్య సేవలు, మల్టీ స్పెషాలిటీ వైద్యం కోసం సమీపంలోని విజయవాడ నగరానికి వెళుతుండేవారన్నారు. ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని పట్టణంలోని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలను పేద ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఆరోగ్య హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, డయాబెటాలజీ విభాగంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, షుగర్, బిపి, థైరాయిడ్, ఎనీమియా, విష జ్వరాలు, గుండె సమస్యలు, చర్మవ్యాధులు, గ్యాస్ట్రో అండ్ లివర్ ప్రాబ్లమ్స్, శ్వాస కోస సంబంధ వ్యాధులు, టిబి, మెదడు, నరాల సమస్యలు, కీళ్ల సమస్యలు, ఆర్థోపెడిక్ సమస్యలు, డయాబెటిక్ కోమ, స్ట్రోక్, ఫిట్స్, పక్షవాతం, ఎమర్జెన్సీ పెయిన్ మేనేజ్‌మెంట్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక లేబరేటరీ సౌకర్యం అందుబాటులో ఉంచడంతో అత్యవసర వైద్య సేవలకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నామన్నారు.


దంతేష్


సాహితి



ఆరోగ్య హాస్పిటల్స్

అత్యవసరం అయితేనే పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రిలో 24 గంటలు వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు అన్ని రకాలైన హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలు ఆసుపత్రిలో వర్తింపచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వపరంగా ఉన్న ఆరోగ్యశ్రీ, ఎన్‌టిఆర్ వైద్య సేవలు మాత్రం అందుబాటులో లేవన్నారు.

తమ ఆసుపత్రిలో ఇసిజి, 2డి ఎకో పరీక్షలు కేవలం రూ.999కే, మాస్టర్ హెల్త్ చెకప్ రూ.5,500 విలువైన పరీక్షలు కేవలం రూ.2999కే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మాస్టర్ హెల్త్ చెకప్‌లో జనరల్ మెడిసిన్ కన్సల్టేషన్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, హెచ్‌బిఎ1సి, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, పిఎల్‌బిఎస్, 2డి ఎకో, ఇసిజి సీరం క్యాల్షియం, సీరం క్రియాటిన్, సీరం యూరిక్ యాసిడ్, టి3, టి4, టి ఎస్‌హెచ్, చెస్ట్ ఎక్స్‌రే, పిఎ వ్యూ ఇలాంటి సదవకాశం ప్రతిరోజు ఉంటుందని తెలిపారు.

ఆరోగ్య సేవలు మెరుగుపరచడమే మా ధ్యేయం

లలిత ప్రియ హాస్పిటల్ వైద్యులు రాజశేఖర్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని మండల కేంద్రంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్ పైన స్థాపించిన లలిత ప్రియ హాస్పిటల్ వైద్యులు తూము రాజశేఖర్ తెలిపారు. తాను ఎంబిబిఎస్, ఎంఎస్ ఆర్థో చేసి రోగులకు అత్యుత్తమ సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. కొయ్యలగూడెం ప్రాంతంలో ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే తమ ధ్యేయమన్నారు. గతంలో ఆర్థోపెడిక్ సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలు కావాలంటే సుమారు 40, 50 కిలోమీటర్లు దాటి రాజమండ్రి, తణుకు, విజయవాడ వంటి ప్రాంతాలకు ప్రజలు వెళ్లి వైద్యం చేయించుకునేవారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా ఎంత ఎమర్జెన్సీ కేసు అయినా చూస్తున్నామన్నారు. మెడ నొప్పి, నడుము నొప్పి, మోకాలు నొప్పి, కీళ్లవాతం, సయాటికా, రుమాటిక్ నొప్పులు వంటి ఎముకలు, కీళ్ల సమస్యలకు సమగ్ర చికిత్స అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా విరిగిన ఎముకల చికిత్స, వంకరగా అతుక్కున్న ఎముకల సర్జరీ, శరీరంలో ఉన్న ప్లేట్లు, రాడ్ల తొలగింపు, మోకాలు, తుంటి ఎముకల రీప్లేస్‌మెంట్, పాలీట్రామా, కాంపౌండ్ ఫ్రాక్చర్ల వంటి సంక్లిష్ట శస్త్రచికిత్సలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. లలిత ప్రియ హాస్పిటల్ కొయ్యలగూడెం మండలంలో మొట్టమొదటిసారిగా ఆధునిక ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసిందన్నారు. విశాలమైన ప్రాంగణం, స్పెషల్ రూమ్స్, ఎసి రూమ్స్, 300 ఎంఎ డిజిటల్ ఎక్స్-రే, సిఎఆర్ఎం ఎక్స్-రే మెషిన్, ఐసియు అనేక వసతులు ఉన్నాయన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు.



లలితప్రియ హాస్పిటల్

మహిళలకు, పురుషులకు విడివిడి వార్డులను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎంప్లాయ్‌మెంట్ హెల్త్ స్కీమ్స్ ద్వారా కాస్ట్ లెస్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. సమాజంలో ఆరోగ్య సేవలను మెరుగుపరచడం తమ బాధ్యతగా భావిస్తామన్నారు. లలిత ప్రియ హాస్పిటల్ నిపుణులైన వైద్య సిబ్బంది, అత్యాధునిక సాంకేతికత, రోగి-కేంద్రీకృత విధానంతో కొయ్యలగూడెం ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తోందని చెప్పారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మనిషి జన్మించిన నాటి నుంచి మరణించేంతవరకు రెవెన్యూ శాఖ ఎంతో వేగవంతమైన సేవలందిస్తున్నట్లు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు రెవెన్యూ శాఖ చక్కని వారధిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బద్రు నాయక్, టిడిపి మండలాధ్యక్షులు రాజబాబు, అధికారులు పాల్గొన్నారు.


ఉంగుటూరు : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిరంతరం వ్యవస్థలను బలోపేతం చేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో డిటి పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడియాల రవిశంకర్, ఇమ్మని గంగాధర్, పాతూరి విజయ్ కుమార్, సురత్తుల అయ్యప్ప, ఎంపిడిఒ రాజ్ మనోజ్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ముసునూరు :స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటరమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కోండేటి బాబి, దేవినేని డలరామ్, దేవినేని ప్రసాద్, నక్కనబోయిన సత్యనారాయణ, గద్దల మోహనరావు, టి.సత్యనారాయణ, పి.కుటంబరావు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :రెవెన్యూ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీలో, స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్లీవజోజి ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి :రాష్ట్ర అభివృద్ధిలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుందని తహశీల్దార్ లతీఫ్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో జాయింట్ ఎల్‌పిఎంల వల్ల అనర్హులైన కొంతమంది లబ్ధిదారులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్య పరిష్కారానికి పలు సూచనలు చేశారు. అనంతరం మాజీ విఆర్‌ఒలు చిట్టూరి నాంచారయ్య, తలగడదీవి బసవ రత్నంలకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

టి.నరసాపురం :ప్రజలకు నిరంతరం రెవెన్యూ సేవలు అందుబాటులో ఉంటాయని తహశీల్దార్ టి.సాయిబాబా అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



ముదినేపల్లిలో...

ఈ కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ రెవెన్యూ అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ స్రవంతి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, పెద్దిన సత్యనారాయణ, కొల్లి రమేష్, పేరం రాంబాబు, కాసన్నేని వెంకట్రావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పోలవరం : తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ డే వేడుకల్లో తహశీల్దార్ సాయిరాజ్ మాట్లాడారు. అనంతరం పలువురు విఆర్‌ఒలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాస్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు గుణపర్తి చిన్ని, టిడిపి మండలాధ్యక్షుడు బొడ్డు కృష్ణ, విఆర్‌ఒ, విఆర్ఎలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందిని, రెవెన్యూలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులు పూర్తి స్థాయిలో నింపాలి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు లాకుల వద్ద సిబి కెనాల్‌కు విడుదల చేసిన మంచినీటితో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేలా స్థానిక సర్పంచులు, నీటి సంఘం నాయకులు, సంబంధిత అధికారులు చొరవ చూపాలని కైకలూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాస్ అన్నారు. నీటి విడుదల కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐటిఐలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఖాళీలు ఉన్న ట్రేడ్స్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రధాన అధికారి రజిత తెలిపారు. నూజివీడులో రజిత శుక్రవారం మాట్లాడుతూ జులై 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు http://www.iti.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ చదవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటిఐ విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు వేగంగా లభిస్తాయని చెప్పారు.

సదరం క్యాంపులో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం సదరం క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో కైకలూరు ప్రభుత్వాసుపత్రి ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు శ్రీనివాస్ సదరం క్యాంపు సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశంతో ప్రత్యేక అవసరాలు గల వ్యక్తుల సర్టిఫికెట్స్ పరిశీలించనున్నట్లు చెప్పారు. వికలాంగుల పింఛన్ పొందే లబ్ధిదారులను పరిశీలించి, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు వివరించారు.

పశువైద్య శాఖాధికారిగా హరికృష్ణ

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మండల పశు వైద్యశాఖాధికారిగా మున్నంగి హరికృష్ణ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పెదవేగి మండలంలో పని చేస్తున్నారు.

పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్య కిట్ల పంపిణీ

ప్రజాశక్తి నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్ని పాఠశాలలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్య కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఇఒ ఎస్.జమలయ్య తెలిపారు. నూజివీడులో ఆయన శుక్రవారం మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక వసతులను కల్పించి చిన్నపాటి మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని పాఠశాలలకు అందమైన రంగులు వేసి తీర్చిదిద్దినట్లు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అన్ని పాఠశాలలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్య కిట్లను అందించామన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో నూటికి నూరు శాతం ఫలితాల సాధన కోసం అవిశ్రాంత కృషి చేస్తున్నట్లు వివరించారు. మొదటి రోజు నుంచి అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు బోధిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సువిశాలమైన క్రీడా ప్రాంగణం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నని బియ్యంతో పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు అనేక క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.

యోగాతో మానసిక, శారీరక ప్రశాంతత

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మానసిక, శారీరక ప్రశాంతత యోగాతోనే సాధ్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలు చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే యోగా మంచి మార్గమని తెలిపారు. 21న స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రయివేట్, ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొని యోగాసనాలు అనుసరించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులంతా సమన్వయంతో పని చేసి యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఏలూరు అర్బన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో యోగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణం నుంచి కళ్యాణమండపం చౌరస్తా వరకు కళాశాల విద్యార్థులు, సిబ్బంది యోగా ప్రాముఖ్యతను తెలియజేసే స్లోగన్లతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్, యోగా దినోత్సవ కళాశాల ఇన్‌ఛార్జి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టివి.దుర్గాప్రసాద్, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ, జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం :యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ జి.నగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా కార్యక్రమం మండలంలోని అన్ని సచివాలయాల్లో శనివారం ఉదయం 6:30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ఉద్యోగులు, ఎస్‌హెచ్‌జి మహిళలు, ఉపాధి శ్రామికులు, రైతులు, వెలుగు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు యోగా కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

112 బస్సులపై కేసులు

ఏలూరు స్పోర్ట్స్ : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 112 బస్సులపై కేసులు నమోదు చేశామని జిల్లా ఇన్‌ఛార్జి ఉప రవాణా కమిషనర్ కృష్ణారావు తెలిపారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులతో పాటు వాణిజ్య, వాణిజ్యేతర వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 112 కేసులను నమోదు చేసి రూ.3.67 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు కృష్ణారావు తెలిపారు.

అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో శుక్రవారం ఉదయం అల్పాహారాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. క్యాంటీన్‌లో అల్పాహారం స్వీకరిస్తున్న వారి నుంచి ఆహారం నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ నిర్వహణ బాగుందని కితాబును ఇచ్చారు. వాష్ బేసిన్ పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. నిత్యం నాణ్యత ప్రమాణాలకు లోపం లేకుండా పరిపూర్ణంగా ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ముసునూరు

జులై తొమ్మిదో తేదీన సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డి.హరినాథ్ కోరారు. ఎఐసిసిటియు కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 20వ తేదీ నుంచి జులై ఐదో తేదీ వరకు ప్రచారం నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ప్రచార జాతా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, ఎఐసిసిటియు నాయకులు వేముల బక్కయ్య, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు పరికల కళావతి, భవాని, సర్వేసు, సుందరం, తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో శిక్షణా తరగతులు

ఏలూరు అర్బన్ :సిపిఎం జిల్లాస్థాయి శాఖ కార్యదర్శులకు, ముఖ్య కార్యకర్తలకు ఈ నెల 22, 23 తేదీల్లో ఏలూరులో శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులకు జిల్లాలోని సిపిఎం శాఖకార్యదర్శులు, ముఖ్యకార్యకర్తలు, ఆహ్వానితులు హాజరవుతారని తెలిపారు. 22, 23 తేదీల్లో కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో జరిగే శిక్షణ తరగతులకు ఏజెన్సీలోని వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాలతో పాటు జంగారెడ్డిగూడెం టౌన్, రూరల్ మండలంలోనీ కార్యకర్తలకు జరగనున్నాయని తెలిపారు.